క్లుప్తంగా

## జాతర ప్రత్యేక సర్వీసులతో రూ. 4.12 లక్షల ఆదాయం

పీలేరు రూరల్‌: కలికిరి యల్లమ్మ జాతరకు పీలేరు డిపో నుంచి ప్రత్యేక సర్వీసులు నడపడం ద్వారా రూ. 4.12 లక్షలు ఆదాయం ఆర్జించినట్లు డీఎం కుమార్‌ మంగళవారం తెలిపారు. జాతరను పురస్కరించుకుని ఆదివారం, సోమవారం రెండు రోజుల పాటు 30 సర్వీసులు నడిపినట్లు తెలిపారు. 9359 కిలోమీటర్లు నడిపి, 44.07 ఈపీకే, ఓఆర్‌ 82 శాతం సాధించినట్లు చెప్పారు.

## వికసించిన బ్రహ్మ కమలం



పీలేరు : అత్యంత అరుదుగా కన్పించే బ్రహ్మ కమలం పీలేరు పట్టణంలో వికసించింది. పీలేరు పట్టణం ప్రకాశంలో రోడ్డులో సి. సుబ్రమణ్యం అలియాస్‌ షామియానా మణి, లక్ష్మీదేవి దంపతులు ఇంటి ఆవరణలో మంగళవారం బ్రహ్మకమలం పుష్పాలు విరబూసాయి. వీటిని పలువురు ఓక్షించడానికి ఆసక్తి చూపారు.

## ఇంటివద్దనే పెన్షన్ల పంపిణీ

మదనపల్లె : మున్సిపాలిటీలోని ఎన్‌టీఆర్‌ భరోసా పెన్షన్‌దారులందరికీ ఆగస్టు 1వతేదీ ఉదయం 6 గంటల నుంచి ఇంటివద్దకే వార్డు సచివాలయ సిబ్బంది వచ్చి పెన్షన్‌ పంపిణీ చేస్తారని మున్సిపల్‌ కమిషనర్‌ కే.ప్రమీల తెలిపారు. మంగళవారం మున్సిపల్‌ కార్యాలయం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో..... వార్డు సచివాలయ సిబ్బంది ఇంటివద్దకే వచ్చి పెన్షన్‌ ఇస్తున్నందున, పెన్షన్‌దారులు అందుబాటులో ఉండాల్సిందిగా కోరారు. అలాగే 1, 2 తేదీలు రెండురోజుల పాటు పెన్షన్ల పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

అందుబాటులో ఉండండి

వాల్మీకిపురం: ఎన్‌టీఆర్‌ భరోసా పింఛన్లు బటన్వాడా కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారులందరూ ఆగస్టు 1న అందుబాటులో ఉండాలని ఎంపీడీఓ సుధాకర్‌ రెడ్డి తెలిపారు. సచివాలయ సిబ్బంది అందరూ ఉదయం 6గంటల నుంచే ఎన్‌టీఆర్‌ భరోసా పింఛన్లు పంపిణీ చేపడతారని తెలిపారు.

## మహిళలకు అందుబాటులో ఉంటాం



మాట్లాడుతున్న తనూజారెడ్డి

పీలేరు : మహిళల సమస్యల పరిష్కారానికి అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి సతీమణి నల్లారి తనూజారెడ్డి అన్నారు. మంగళవారం పీలేరులోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ మహిళలు ఎప్పుడు ఎలాంటి సమస్య వచ్చినా తనకు ఫోన్‌ చేసి సంప్రదించవచ్చునని తెలిపారు. తన భర్త గెలుపునకు కృషి చేసిన పార్టీ నాయకులు, కార్యకర్తలకు తాము ఎల్లప్పుడు అందుబాటులో ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ రెడ్డిబాషా, తెలుగు మహిళ మండల అధ్యక్షురాలు పురం రెడ్డెమ్మ, నాయకులు పురం రామ్మూర్తి, అమరనాథరెడ్డి, చందన, రెడ్డిరాణి, కళావతి, సర్వ, ప్యారీజాన్‌, రమాదేవి, లక్ష్మీకాంత, అనురాధ, కుమారి, ఎల్లా, ఉమ, సాదిన, సత్యప్రియ, నల్లారి రియాజ్‌, ఖాదర్‌బాస్కర్‌, సురేష్‌, అంజి, బాలాజి, మల్లికార్జున, విజయ్‌కుమార్‌, తదితరులు పాల్గొన్నారు.

## ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

తంబళ్లపల్లె: మండలంలోని ప్రజలు తమ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కొన్ని మడుగు గ్రామ పంచాయతీ కార్యదర్శి సునీల కోరారు. మంగళవారం మండలంలో పారిశుధ్యం స్పెషల్‌ డ్రైవ్‌లో భాగంగా పారిశుధ్యం మెరుగుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. తాగునీటి ట్యాంకులను శుభ్ర పరిచి బ్లీచింగ్‌ కలిపారు. తాగునీటి బోర్లు, కుళాయిల వద్ద మురికినీటి గుంతలు పూడ్చారు. సీజనల్‌ వ్యాధులు అతిసార, డెంగీ, టైఫాయిడ్‌, మలేరియా వంటి వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండి ముందస్తు జాగ్రత్తలు పాటించాలన్నారు.

## దోమల నివారణతో ఆరోగ్యం

పీలేరు: దోమలను నివారించడం ద్వారా ఆరోగ్యంగా జీవించగలమని హెల్త్‌ కౌండస్య అన్నారు. మంగళవారం తలుపుల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మేళ్లచెరువులో విద్యార్థులతో కలసి డెంగీ వ్యతిరేక మాసోత్సవాలు అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సురేంద్ర, వర్యవేక్షకులు కృష్ణయ్య, ఉపాధ్యాయులు రమణయ్య, శివశంకర్‌ సీహెచ్‌ఓ కుమదా, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## మల్లీడే బాలుర జిల్లా జట్టు ఎంపిక

వాల్మీకిపురం: మల్లీడే బాలుర జిల్లా జట్టు ఎంపికలో భాగంగా ప్రభుత్వ మ్యాథ్‌ వాల్మీకిపురం జెడ్పీహెచ్‌ఎస్‌ క్రికెట్‌ గ్రౌండ్‌లో నిర్వహించినట్లు ఉమ్మడి జిల్లా క్రికెట్‌ అసోసియేషన్‌ అధ్యక్షులు విజయ్‌ కుమార్‌ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో టర్ఫ్‌ పిచ్‌ ఉండటం చాలా శుభపరిణామమన్నారు. అలాగే జిల్లా వ్యాప్తంగా గ్రాస్‌ రూట్‌ లెవెల్‌ క్రికెట్‌ కార్యక్రమాలను అభివృద్ధి చేస్తామన్నారు. జిల్లా జట్టుకు ఎంపికైన వారు ఆగస్టు 1వ తేదీన వెంకటగిరిలో జరిగే సీనియర్‌ ఇంటర్‌ డిస్ట్రిక్ట్‌ మీట్‌లో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు శ్రీధర్‌ కుమార్‌, శ్రీనివాసులు, సభ్యులు సతీష్‌, సునీల్‌ కుమార్‌, గిరిప్రకాష్‌, తదితరులు పాల్గొన్నారు.

# స్ఫూర్తి నింపుదాం..మెరికల్లా తీర్చిదిద్దుదాం



హాకీ ఆడుతున్న క్రీడాకారులు

మదనపల్లె సిటీ: పారిస్‌ ఒలింపిక్స్‌ క్రీడలు ఈనెల 26 నుంచి ప్రారంభమయ్యాయి. 32 క్రీడాంశాల్లో 329 పతకాల కోసం క్రీడా యోధులు తలపడుతున్నారు. అందులో 117 భారత క్రీడా సైన్యం ఉంది. 40 మందికిపైగా మహిళా అథ్లెట్లు ఉన్నారు. ఇందులో ఐదుగురు తెలుగమ్మాయిలు ఉన్నారు. వీరిలో పీవీ సింధు, నిఖత్‌ జరీన్‌, జ్యోతియర్రాజీ, శ్రీజ ఆకుల, జ్యోతిక శ్రీ విశ్వ క్రీడా రంగామంలో ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వారిని స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థులు ఆటల్లో రాణించేలా ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. ఇప్పటికే మన దేశం నుంచి షూటింగ్‌ పోటీల్లో మనూబాకర్‌ రెండు సిల్వర్‌ పతకాలు సాధించి దేశానికి పేరు ప్రఖ్యాతులు తెచ్చింది. మదనపల్లె విద్యాశాఖ డివిజన్‌ పరిధిలో 138 ప్రభుత్వ, 114 ప్రైవేటు పాఠశాలలు ఉండగా అందులో పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో క్రీడా మైదానాలు లేక విద్యార్థులు ఆటలకు దూరంగా ఉంటున్నారు. ఒలింపిక్స్‌ జరుగుతున్న నేపథ్యంలో సాక్షి ప్రత్యేక కథనం.

శారీరక శ్రమ తగ్గి దుష్పలితాలు

ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు ఉదయం నుంచి రాత్రి వరకు పాఠశాల, ట్యూషన్లతో బిజీబిజీగా ఉంటున్నారు. దీంతో శారీరక శ్రమ తగ్గిపోయి, చిన్న వయస్సులోనే అనేక రుగ్మతల బారిన పడుతున్నారు. భావితరాల భవిష్యత్తు బాగుండాలంటే విద్యా సంస్థల్లో క్రీడా స్థలం ఉండాలని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. విద్యా సంస్థను ప్రారంభించేందుకు ఆట స్థలం ఉండాలనే నిబంధనలున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. భారత్‌లో ఇండియాలో భాగంగా కేంద్రం క్రీడా రంగానికి నిధులు కేటాయిస్తున్నా ఉపయోగించుకునే స్థితిలో బడులు లేవని కొందరు ఉపాధ్యాయులు వాపోతున్నారు.

ఆట స్థలాలు కరువు

పాఠశాల ప్రారంభించాలంటే కనీసం 250 గజాల ఆట స్థలం ఉండాలనే నియమం ఉంది. అనుమతి కోసం దరఖాస్తు చేసుకునే సమయంలో నిబంధనల్ని పాటిస్తూ ప్రైవేటు యాజమాన్యాలు చూపించి తర్వాత వాటిని ఉల్లంఘిస్తున్నారు. కొన్ని ప్రైవేటు పాఠశాలల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు పాఠ్యాంశాలు బోధిస్తుండటంతో విద్యార్థులు క్రీడలకు దూరమవుతున్నారు. హాకీ క్రీడా మాంత్రికుడు ధ్యాన్‌చంద్‌ మదనపల్లె బీటీ కాలేజీ క్రీడామైదానంలో హాకీ క్రీడను పరిచయం చేశారు. అప్పటి భారత హాకీ క్యాప్టెన్‌ ముజీబ్‌తో పాటు పలువురు హాకీ పోటీల్లో పాల్గొన్నారు. మదనపల్లె క్రీడాకారులకు పుట్టినిల్లు.

### ఆటలతో మానసిక వికాసం



విద్యార్థుల్లో శారీరక శ్రమ ఉండడం లే దు. సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వర కు నాలుగు గోడల మధ్య నే ఉంటున్నారు. సూర్యరశ్మి అందరక 80 శాతం మంది విద్యార్థుల్లో విటమిన్‌–డీ లోపం ఏర్పడుతోంది. ఆటల్లో గెలుపోటములు సహజం. మానసికంగా, శారీరకంగా దృఢంగా తయారవుతారు.

– డాక్టర్‌ వెంకటే, మెడికల్‌ ఆఫీసర్‌, తంబళ్లపల్లె

### వ్యాయామ తరగతి తప్పనిసరి



పాఠశాలల్లో విద్యార్థులకు వ్యాయామ తరగతి తప్పనిసరిగా చేయాలి. దీని వల్ల చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెరుగుతుంది. స్కూల్‌ ఫెడరేషన్‌ గేమ్స్‌ ఏటా ఒకసారి కాకుండా రెండు సార్లు నిర్వహించాలి. ప్రభుత్వం సోపార్ట్‌లు కల్పిస్తేనే క్రీడల కోసం పాటుపడే స్వచ్ఛంద సంస్థలు భాగస్వామ్యం చేయాలి.

–ప్రసాద్‌రెడ్డి , ది హాకీ జిల్లా కార్యదర్శి

## రెవెన్యూ రికార్డులను పటిష్టంగా భద్రపరచండి

– మదనపల్లె సబ్‌ కలెక్టర్‌ మేఘ స్వరూప్‌



రికార్డులను పరిశీలిస్తున్న సబ్‌ కలెక్టర్‌

వాల్మీకిపురం: రెవెన్యూ రికార్డులను పటిష్టంగా భద్రపరచాలని మదనపల్లె సబ్‌ కలెక్టర్‌ మేఘ స్వరూప్‌ ఆదేశించారు. మంగళవారం సాయంత్రం ఆయన వాల్మీకిపురం తహసీల్దార్‌ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. సుమారు అరగంట పాటు రికార్డు గదిలోని రికార్డులను పరిశీలించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రికార్డు గదుల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, విజటర్స్‌ రిజిస్టర్‌ నిర్వహణ తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలన్నారు. విధుల విషయంలో బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్‌ ఫిరోజ్‌ ఖాన్‌, సర్వేయర్‌ శ్రీనివాసులు, ఆర్‌ఐ శశికళ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## మానవతా విలువలతోనే సమస్యకు పరిష్కారం

–ఎమ్మెల్యే షాజహాన్‌బాషా



మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవపోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె సిటీ: మానవతా విలువలు పెరిగినప్పుడే సమస్యకు పరిష్కారమవుతుందని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. మంగళవారం పోర్డు సంస్థ ఆధ్వర్యంలో మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల ఆడపిల్లలు మిస్సింగ్‌ అవుతున్నారన్నారు. అందరూ కలిసి సమిష్టిగా సమస్య పరిష్కరించాలన్నారు. పోర్డు డైరెక్టర్‌ లలితమ్మ మాట్లాడుతూ బాల అక్రమ రవాణా అనేక రూపాల్లో వచ్చే అవకాశం ఉందన్నారు. బాలల అక్రమ రవాణా మాఫియా ఎక్కువ శాతం బాలలనే టార్గెట్‌ చేస్తారన్నారు. బయట వ్యక్తులతో పరిచయం లేని వారిని నమ్మకూడదన్నారు. ఒంటరిగా జాతర్లకు,పండుగలకు వెళ్లకూడదన్నారు. కార్యక్రమంలో పోర్డు కోఆర్డినేటర్‌ ప్రమీల, రాధారాణి, నిర్మల, అల్తాఫ్‌, వార్డెన్‌ రాంప్రసాద్‌,హెచ్‌ఎం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును గౌరవించాలి



మాట్లాడుతున్న మలతోటి నరేష్‌

మదనపల్లె : ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ వ్యతిరేకమని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గౌరవించకుండా, మళ్లీ వర్గీకరణ చేసేందుకు ప్రయత్నం చేయడాన్ని వ్యతిరేకిస్తున్నామని మాల స్టూడెంట్‌ ఫెడరేషన్‌ రాయలసీమ అధ్యక్షులు మలతోటి నరేష్‌ అన్నారు. మంగళవారం స్థానిక మాలమహానాడు కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో నరేష్‌ మాట్లాడుతూ...ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ వ్యతిరేకమంటూ 2004 నవంబర్‌ 5న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు గౌరవిస్తూ అమలుచేయాలన్నారు. పెరిగిన జనాభా దామాషా ప్రకారం ఎస్సీ రిజర్వేషన్లు 20శాతం, ఎస్టీ రిజర్వేషన్లు 10శాతం పెంచాలన్నారు. ఎస్సీ,ఎస్టీ బ్యాక్‌లాగ్‌ పోస్టులు భర్తీతో పాటు, ప్రైవేట్‌రంగంలో రిజర్వేషన్లు అమలుజరపాలన్నారు. కార్యక్రమంలో నాయకులు యమలాచంద్రయ్య, గుండామనోహర్‌, మల్లెల మోహన్‌, అమ్రేష్‌, రామచంద్ర, కృష్ణమూర్తి, గంగరాజు, అప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

## గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న అధికారులు

పెద్దతిప్పసముద్రం/ ములకలచెరువు: అసంపూర్తిగా ఉన్న పక్కా గృహాల నిర్మాణాలు వేగవంతం అయ్యేలా చూడాలని జిల్లా హౌసింగ్‌ ప్రాజెక్టు డైరెక్టర్‌ సాంబశివయ్య అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన పెద్దతిప్పసముద్రం, ములకలచెరువు మండలాల్లో విస్తృతంగా పర్యటించి పలు గృహాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ గృహాలు మంజూరైనా ఇంత వరకు పునాదులు కూడా చేపట్టని వారిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ రెండు మండలాల్లో పూర్తయిన గృహాలు, లేఅవుట్లలో మౌలిక వసతుల కల్పన, దశల వారీగా ఉన్న గృహ నిర్మాణాల సంఖ్యను అడిగి తెలుసుకున్నారు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీఓలు, స్పెషలాఫీసర్లు, ఏఈలు, ఇంజనీరింగ్‌ అసిస్టెంట్లు ఉన్నారు.

## కళాశాల విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

నిమ్మనపల్లె : మండలంలోని ప్రభుత్వ కాలేజీలకు పుస్తకాలను పంపిణీ చేసినట్లు ఎంఈఓ –2 నారాయణ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని ప్రభుత్వ జూనియర్‌ కళాశాల, ఏపీ మోడల్‌ స్కూల్‌, కేజీబీవీ పాఠశాలల్లోని 433 మంది విద్యార్థులు కాలేజీ ప్రవేశాలు పొందారన్నారు. వారికి సంబంధించిన పాఠ్యపుస్తకాలు నోటు పుస్తకాలను ప్రభుత్వం స్థానిక ఎమ్మార్సీకి పంపించిన్నారు. 5,196 నోట్‌ పుస్తకాలు, 2623 టెక్స్ట్‌ పుస్తకాల ను ఆయా సబ్జక్టుల సంబంధించిన సీఆర్‌పీల ద్వారా పంపిణీ చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో సీఆర్పీలు సుధాకర, పద్మనాభం, మంజుల, స్వాతి, సీటీ సౌజన్య, ఎంఐఎస్‌ కోఆర్డినేటర్‌ నరసింహులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదువుకోవాలి

మదనపల్లె సిటీ: విద్యార్థి దశలో ఇంటర్మీడియట్‌ ఎంతో ముఖ్యమైనదని క్రమశిక్షణతో చదువుకుంటే ఉన్నత స్థాయికి ఎదగవచ్చునని జిల్లా ఇంటర్మీడియట్‌ అధికారి కృష్ణయ్య అన్నారు. మంగళవారం ప్రభుత్వ బాలికల జూనియర్‌ కాలేజీలో విద్యార్థులు ప్రభుత్వం సరఫరా చేసిన ఉచిత పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ప్రభుత్వం అందజేసిన పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.అధ్యాపకుల సూచనలు,సలహాలు తీసుకోవాలన్నారు.

## విద్యార్థులు సేవాభావం అలవర్చుకోవాలి

వాల్మీకిపురం: ప్రతి విద్యార్థి సేవాభావం అలవర్చుకోవాలని స్థానిక వివిసి ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం సావిత్రి అన్నారు. మంగళవారం స్థానిక పాఠశాలలో 10 మంది ఎన్‌సిసి క్యాడెట్స్‌ క్యాంపు సర్టిఫికేట్లను అందించారు. జూన్‌ 21 నుండి 30వరకు తిరుపతిలోని ఎన్‌సిసి నగర్‌లో జరిగిన 2వ కంబైన్డ్‌ అన్యువల్‌ ట్రైనింగ్‌ క్యాంపులో పాల్గొని, ప్రతిభ కనబరిచిన క్యాడెట్స్‌ను హెచ్‌ఎం సావిత్రి అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రమశిక్షణకు, ఐక్యతకు మారుపేరు ఎన్‌సిసి అని, ఎన్‌సిసి వల్ల విద్యార్థుల్లో దేశభక్తి, సేవాభావం పెంపొందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవీంద్ర రెడ్డి, రమణప్ప, నాగరాజ, దుర్గాప్రసాదు నాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ముగిసిన ఎల్లమ్మ తిరునాల

కలికిరి: మండల కేంద్రంలో మూడు రోజులు వైభవంగా నిర్వహించిన గ్రామదేవత ఎల్లమ్మ తిరునాల నాల్గవ రోజు కళ్లిపాటు ఉత్సవంతో ముగిసింది. మంగళవారం అమ్మవారి పార్వేట ఉత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్లమ్మ ఉత్సవమూర్తి పారువేట వెళ్లె దుప్పటికుల గ్రామంలోకి ప్రవేశించకుండా అడ్డగించడం ఆనవాయితీగా ఆలయంలోకి ప్రవేశించారు. తదుపరి అమ్మవారి కళ్లిపాటు కార్యక్రమం నిర్వహించారు. దీంతో జాతర ఉత్సవం ముగిసింది. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తు నిర్వహించిన పోలీసు సిబ్బంది, అమ్మవారి ఉంటకట్టీ, సహకరించిన భక్తులకు ఆలయ ధర్మకర్త అశోక్‌ మారెడ్డి, ఆలయ నిర్వాహకులు మధుసూదన్‌రెడ్డి, సురేంద్రరెడ్డి, యోగేష్‌ రెడ్డిలు కృతజ్ఞతలు తెలిపారు.

## భక్తిశ్రద్ధలతో కావిళ్ల పండగ

రామసముద్రం: మండలంలోని తిరుమలరెడ్డిపల్లి గ్రామంలో మంగళవారం భక్తిశ్రద్ధలతో కావిళ్ల పండుగ నిర్వహించారు. భక్తులు పసుపు వస్త్రాలు ధరించి ఉపవాస దీక్షలతో శ్రీసుబ్రమణ్యస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి, కావిళ్లను పూజించారు. అలాగే గ్రామంలో హరోహరా అంటు స్వామివారిని దీక్షించి మెరవని వెళ్లారు. ఇంటింటా మహిళలు కావిళ్లకు నమస్కరించి కానుకలు సమర్పించారు. అనంతరం చిమనకుండలోని తిరుత్తని శ్రీ సుబ్రమణ్యస్వామి కొండపై ముడుపులు చెల్లించేందుకు బయలుదేరి వెళ్లారు.

## ఇళ్ల నిర్మాణాలపై సమీక్ష

బి.కొత్తకోట: నగర పంచాయతీకి చెందిన పేదలకు ప్రభుత్వం మంజూరు చేసిన స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలు వేగంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్‌, కురవానికుంట లేఅవుట్‌ ప్రత్యేకాధికారి పీఆర్‌.మనోహర్‌ అన్నారు. మంగళవారం కార్యాలయంలో ఏఈ రాజేంద్ర, ఇంజనీరింగ్‌ అసిస్టెంట్లతో ఇళ్ల నిర్మాణాలపై సమీక్ష నిర్వహించారు. కురవానికుంట లేఅవుట్‌లో 630 ప్లాట్లు ఉండగా 504 ప్లాట్ల కేటాయింపు జరిగిందని, ఇందులో లబ్ధిదారులు నిర్మాణాలు చేపట్టారన్నారు. ఈ నిర్మాణాలు ఎస్థాయిలో ఉన్నాయి, ఏ చర్యలు చేపడితే పూర్తవుతాయో తక్షణమే నివేదిక ఇవ్వాలని కోరారు. బద్దిపట్లోగిట్ల లేఅవుట్‌లో 307 ప్లాట్లు ఉండగా 276 మంది లబ్ధిదారులకు స్థలాలు కేటాయించారన్నారు. ఇక్కడ కూడా నిర్మాణాలపై క్షేత్రస్థాయిలో పరిశీలించి అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం మున్సిపాలిటీకి చెందిన వివిధ విభాగాల ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. బుధవారం పింఛన్ల పంపిణీ విషయంలో ఎలాంటి పొరబాట్లు జరుగకుండా పక్కాగా చర్యలు తీసుకోవాలని సూచించారు. మేనేజర్‌ రమాదేవి, ఆర్‌ఐ శ్రీనివాసులు, టీపీఎస్‌ రెడ్డెమ్మ, సందీప్‌, సిబ్బంది పాల్గొన్నారు.

## ఉపాధి కూలీల ఫిర్యాదుపై విచారణ

కలికిరి: మండలంలోని మేడికుర్తి గ్రామ పంచాయతీ ఉపాధి హామీ ఫీల్డ్‌ అసిస్టెంట్‌ అజామ్‌ బాషాపై ఉపాధి కూలీలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జిల్లా డ్వామా ఏపీడీ బాలమునెయ్య, అసిస్టెంట్‌ విజిలెన్స్‌ అధికారి ప్రకాష్‌ మంగళవారం మేడికుర్తి గ్రామంలో విచారణ చేపట్టారు. ఎంపీడీఓ రామక్రిష్ణయ్య, ఏపీఓ సుజాత ఆధ్వర్యంలో గ్రామస్థులను విచారించిన అధికారులు నివేదికను ఉన్నతాధికారులకు ఇవ్వనున్నట్లు వారు పేర్కొన్నారు.

## డీపీఓ విస్తృత తనిఖీలు

కలికిరి: జిల్లా పంచాయతీ అధికారి ధనలక్ష్మి మండలంలోని మంగళవారం విస్తృతంగా పర్యటించారు. కలికిరి మేజర్‌ పంచాయతీ కార్యాలయాన్ని తనిఖీ చేసిన ఆమె పారిశుధ్య పనులను పరిశీలించారు. అనంతరం ప్రీ–ఓన్‌, ఓడీఎఫ్‌ ప్లస్‌ యాప్‌లను పరిశీలించి సిబ్బందికి సూచనలిచ్చారు. సీజనల్‌ వ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్య పనులు చేపట్టాలని ఆవశ్యకతపై సిబ్బందికి సూచనలిచ్చారు. విజిబుల్‌ క్లీన్‌ గ్రామ పంచాయతీలో భాగంగా మండలంలోని మునెల్లపల్లె గ్రామ పంచాయతీలో పరిశీలించిన ఆమె అక్కడ జరుగుతున్న ఎస్‌డబ్ల్యూపీసీ పనులను తనిఖీ చేశారు. అలాగే మల్లికానుపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు.

## నేడు వారపుసంత వేలం

రామసముద్రం: రామసముద్రం పంచాయతీలోని వారపుసంత, బస్టాండ్‌ నిర్వహణకు బుధవారం వేలం నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి విశ్వపతి తెలిపారు. స్థానిక సచివాలయం–2 వద్ద ఉదయం 11 గంటలకు వేలం పాట నిర్వహించనున్నట్లు తెలిపారు.

# మార్మోగిన హరిహర నామస్మరణ

– ఘనంగా ఆడికృత్తిక ఉత్సవాలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

మదనపల్లె సిటీ: మదనపల్లె పట్టణంలోని సుబ్రమణ్యస్వామి ఆలయాలు భక్తుల హరి హర నామస్మరణతో మారుమోగాయి. ఆడికృత్తిక సందర్భంగా మంగళవారం భక్తులు పెద్ద సంఖ్యలో స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. స్థానిక దేవళంవీధిలోని శ్రీ సోమేశ్వరస్వామి ఆలయంలోని బాలసుబ్రమణ్యంకు అర్చకులు పణికుమార్‌శర్మ ప్రత్యేక అలంకరణ చేసి పంచామృత, రసగుంధ ద్రవ్యముతో అభిషేకం చేశారు. కృత్తిక నక్షత్రం కారణంగా ఆక్షేప బలి కార్యక్రమం నిర్వహించారు. పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. స్థానిక బెంగళూరు రోడ్డులోని శ్రీ సోమేశ్వరస్వామి ఆలయంలోని శ్రీ వల్లిదేవసేనసమేత సుబ్రమణ్యస్వామికి ఉదయం అభిషేకాలు, పూజలు చేశారు.సాయంత్రం స్వామి, అమ్మవార్లకు కళ్యాణోత్సవం నిర్వహించారు. స్థానిక వరాల ఆంజనేయస్వామి ఆలయంలో సుబ్రమణ్యస్వామి విశేష అలంకరణ చేసి పూజలు చేశారు. నిమ్మనపల్లె రోడ్డులోని శ్రీవల్లిదేవసేనసమేత సుబ్రమణ్యస్వామి ఆలయంలో ఆడికృత్తిక వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక అయ్యప్పస్వామి ఆలయంలో సుబ్రమణ్యస్వామికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించారు.

వాల్మీకిపురంలో..

వాల్మీకిపురం: వాల్మీకిపురం పట్టణ పడమర పాలెం దర్వాజవద్దగల వెలసిన శ్రీ కార్యసిద్ధి అభయాంజనేయస్వామి సమూహ దేవాలయంలో మంగళవారం ఆడి కృత్తిక మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా షిరిడిసాయి సాలిగ్రామ తిరువనాదాయం చారిక సేవా ట్రస్ట్‌ ఆధ్వర్యంలో ఉదయం సుబ్రహ్మణ్యస్వామికి అభిషేకం, అర్చన, తోమాలసేవ తదితర కార్యక్రమాలతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే ఉదయం వల్లీదేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యస్వామిని పుష్పవల్లికలో విశేష అలంకరణలో చేసి పురవీధుల్లో ఊరేగించారు. ఆలయంలో భక్తులు కావడులు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేసి, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు శ్రీనివాసాచార్యులు, పూజారి అభిరామ్‌స్వామి, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

# బొప్పాయి రైతులను ఆదుకోవాలి

- రైతుసంఘం ప్రధాన కార్యదర్శి కే.వి.వి.ప్రసాద్‌
- ఆగస్టు 9న చలో జిల్లా కలెక్టరేట్‌



మాట్లాడుతున్న కే.వి.వి.ప్రసాద్‌

మదనపల్లె : నాసిరకం నారుతో నష్టపోయిన బొప్పాయి రైతులకు నష్టపరిహారం చెల్లించాలని, నారు విక్రయించిన నర్సరీ యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆగస్టు9న రాయచోటి కలెక్టర్‌ ఆఫీస్‌వద్ద నిర్వహిస్తున్న ధర్నాను విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్‌ రైతుసంఘం ప్రధాన కార్యదర్శి కే.వి.వి.ప్రసాద్‌ పిలుపునిచ్చారు. బొప్పాయి రైతుల సంఘం జిల్లా కన్వీనర్‌ కె.రామకృష్ణ అధ్యక్షతన బొప్పాయి రైతుల సమావేశం మంగళవారం పట్టణంలోని ఎన్‌వీఆర్‌ ఫంక్షన్‌ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా కే.వి.వి.ప్రసాద్‌ మాట్లాడుతూ నర్సరీ యజమానుల మోసానికి నష్టపోయిన బొప్పాయి రైతులకు ఎకరానికి రూ.6లక్షల నష్టపరిహారం చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. నర్సరీ యజమానులపై క్రిమినల్‌ కేసులు పెట్టి వెంటనే అరెస్ట్‌చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. నాసిరకం నారు కారణంగా సుమారు రూ.4 నుంచి 5 కోట్ల నష్టం జరిగిందన్నారు. జిల్లాలో 200 ఎకరాల్లో పంటనష్టం జరిగి రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. కౌలురైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య మాట్లాడుతూ.. కౌలు రైతులు ఆయాయకట్టుల్లో ఆసరాగా చేసుకుని, నర్సరీ యజమానులు నాసిరకం నారును అంటగడుతున్నారు. మార్కెట్‌లో విచ్చలవిడిగా నాసిరకం విత్తనాలు అమ్ముతున్న కంపెనీలపై, నాసిరకం నారు పెంచుతున్న నర్సరీ యజమానులపై ఎటువంటి చర్యలు తీసుకోవడం దారుణమన్నారు. ఏపీ రైతుసంఘం జిల్లా కార్యదర్శి వంగిమళ్ల రామలింగారెడ్డి మాట్లాడుతూ...బొప్పాయి సాగుచేసే రైతుల్లో 99శాతం కౌలు రైతులేనని, వీరికి రాష్ట్ర ప్రభుత్వం కౌలు గుర్తింపుకార్డులు మంజూరు చేయడంలేదన్నారు. సమావేశంలో రైతుసంఘ నాయకులు రామకృష్ణ, గంగిరెడ్డి, అనిల్‌కుమార్‌, వేణుగోపాల్‌, యనమలవెంకటరమణ, గంగరాజు, రామమూర్తి, గురునాథ, నారాయణ, రామచంద్రయాదవ్‌, రంగయ్య, సుధాకర్‌, వేణుగోపాల్‌, శ్రీరాములు పాల్గొన్నారు.

# బీసీజీ టీకాలపై అవగాహన

మదనపల్లె: క్షయ వ్యాధి నిర్మూలనకు కేంద్ర ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న బీసీజీ టీకాలపై హెల్త్‌ ఎడ్యుకేటర్‌ మహమ్మద్‌ రఫీ, మదనపల్లె క్షయ నిర్మూలన విభాగ పర్యవేక్షకులు ప్రభాకర్‌ ప్రజలకు అవగాహన కల్పించారు. మంగళవారం పట్టణంలోని గోకుల్‌ దాస్‌ ఎక్స్‌పోర్ట్స్‌ లిమిటెడ్‌ ఫ్యాక్టరీస్‌ ఆధ్వర్యంలో ఈశ్వరమ్మ కాలనీ, దొంతి వీధి మసీదు, ఈశ్వరమ్మ కాలనీ రహంతీయ మసీదు, పోలేరమ్మ గుడి,శివాజీ నగర్‌, ఎస్టేట్‌ లోని తదితర ప్రాంతాల్లో ఉన్న ప్రజలు ఉద్యోగులకు పెద్దవాళ్లకు టీకాలపై అవగాహన కల్పించారు. టీకాల ద్వారా అనేక రకాల వ్యాధుల నుంచి శరీరానికి కలిగే రక్షణ పై వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ బీసీజీ టీకా వేసుకోవాలన్నారు. టీబీ ముక్త్‌ భారత్‌ లక్ష్యంగా అందరూ కృషి చేయాలన్నారు.